## చలన చిత్రం

ఎప్పుడో నేను ఫోటో తీసేదాకా
నీ బాల్యం ఉంటుందిరా, బాబూ !
మంచులా, మైనంలా,
మౌనంగా కరిగిపోతుంది.

బాల్యం ఒక ప్రవాహం
-వెళుతూ, వెళుతూ కాస్సేపు
ఈ పసివాడి దగ్గర సేద తీరింది.

యౌవనం ఒక రుతుపవనం
-పోతూ పోతూ ఆమె నీలాకాశ దేహం మీద
ఒక ఇంద్రధనుస్సు విసిరింది.

గిర్రున తిరిగే వంద దృశ్యాలలో
ఏ చిన్న ముక్కో
ఈ కెమేరా కంటికి చిక్కుతుంది.

అనవరతం సాగే ఈ అనంత గీతంలో
ఏ ఒక్క మాటో
ఈ పాళీ నాల్కకి పట్టుబడుతుంది.

ఈ కనిపించని ప్రవాహపు
కదలికలో ఉన్న అందాన్ని,
దేనితో కేప్చర్ చెయ్యమంటావు ?

జూలై, '87